RNI. No. TELTEL /2022/ 89348



మన వార్తలు.. మన సమాచారం.. మన విశేషాల మాగాణ.. మన..

# తెలంగాణ అవతరణ

ఆత్మ గౌరవ అక్షర సాక్ష్యం

తె లు గు ది న ప త్రి క

సంపుటి : 4 సంచిక : 121 | పెద్దపల్లి | ఎడిటర్ : పి. రామకృష్ణ | గురువారం, ఏప్రిల్,30, 2026 | పేజీలు : 8 | వెల : రూ. 5/-

## రైతులకు ఎలాంటి ఇబ్బందులు

## తలెత్తకూడదు : మంత్రి పొన్నం



భీమదేవరపల్లి: హనుమకొండ జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోని భీమదేవరపల్లి మండలంలో పెండింగ్ అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలుపై రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం అధికారులతో విస్తృత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శిస్తే సహించబోమని హెచ్చరించారు. మండలంలోని ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడకుండా అన్ని మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవడంతో పాటు రైతులకు తాగునీరు, నీడ, కూర్చునే సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. రైతుల పంటకు గిట్టుబాటు ధర లభించేలా పారదర్శకంగా కొనుగోళ్లు నిర్వహించాలని పేర్కొన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఎక్కడైనా నీటి కొరత ఏర్పడితే వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రజలకు నిరంతరాయంగా తాగునీరు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 'బడిబాట' కార్యక్రమాన్ని విజయవంతం చేసి విద్యార్థుల అడ్మిషన్లు పెంచేందుకు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రభుత్వ విద్యపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరిగేలా పాఠశాలల్లో మౌలిక వసతులు, బోధన ప్రమాణాలను మెరుగుపరచాలని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి అర్హులైన లబ్ధిదారులకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో జాప్యం చోటుచేసుకోకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. వన మహోత్సవం కార్యక్రమాన్ని గ్రామస్థాయిలో విస్తృతంగా నిర్వహించి ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్క నాటేలా అవగాహన కల్పించాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం పెరగాలని కోరారు. గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ రవి, జడ్పీ సీఈఓ శేషాద్రి, ఆర్డీవో రాథోడ్, ఎంపీడీఓ వీరేశం, తహసీల్దార్ రాజేష్, సీఐ పులి రమేష్, ఎస్సైలు ఎం.రాజు, దివ్య, నాగేశ్వరరావు, సర్పంచులు మాచెర్ల కుమారస్వామి, జాలి ప్రమోద్ రెడ్డి, కేతిరి లక్ష్మారెడ్డి, గద్ద కుమారస్వామి, మార్కెట్ కమిటీ చైర్మన్ సంతాజీ, అధ్యక్షుడు చిట్టెంపల్లి ఐలయ్య, కొలుగూరి రాజు, ఆదరి రవీందర్ లతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మెట్రో రైల్ స్వాధీనానికి సర్వం సిద్ధం..

### సీఎం రేవంత్‌తో ఎల్ అండ్ టీ చైర్మన్ ఎస్.ఎన్.సుబ్రహ్మణ్యన్ భేటీ



**హైదరాబాద్,ఏప్రిల్ 29:** హైదరాబాద్ మెట్రో రైల్ మొదటి దశ ప్రాజెక్టు అధికారికంగా ప్రభుత్వ పరం కాబోతోంది. ఎల్ అండ్ టీ కంపెనీ నుంచి మెట్రో వాటాలను కొనుగోలు చేసే ప్రక్రియ తుది అంకానికి చేరుకుంది. ఈ చారిత్రాత్మక ఘట్టం నేపథ్యంలో ఎల్ అండ్ టీ కంపెనీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.ఎన్. సుబ్రహ్మణ్యన్ ఇవాళ స్టేట్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వారు ఇరువురు మెట్రో బదిలీకి సంబంధించిన కీలక అంశాలపై చర్చించినట్లుగా సమాచారం. ఎల్ అండ్ టీ కంపెనీ ఇన్నాళ్లుగా నిర్వహించిన ఆపరేషన్స్, భవిష్యత్తులో రెండో దశ మెట్రో పనుల్లో ఆ కంపెనీ భాగస్వామ్యంపై కూడా ప్రాథమికంగా డిస్కస్ చేసినట్లుగా తెలుస్తోంది. హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ స్వాధీన ప్రక్రియకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అధ్యక్షతన మంగళవారం సాయంత్రం కీలక బోర్డు సమావేశం జరిగింది. ఈ భేటీలో మెట్రో వాటాల కొనుగోలు ఒప్పందానికి బోర్డు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో వాటా కొనుగోలు ఒప్పందం సిద్ధమైంది. ప్రస్తుతం ఇరు సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. మెట్రో ప్రాజెక్టు స్వాధీన ప్రక్రియకు ఏప్రిల్ 30వ తేదీని గడువుగా నిర్ణయించారు. ఈ గడువు సమీపించడంతో మెట్రో రైలు ప్రధాన కార్యాలయంలో ఒక్కసారిగా హడావుడి మొదలైంది. టెక్నికల్, ఫైనాన్షియల్ అంశాలను క్లియర్ చేసేందుకు అధికారులు రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారు. నేడో, రేపో ఈ ప్రక్రియ అధికారికంగా ముగిసి, మెట్రో రైలు పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోకి రానుంది. కాగా, వాస్తవానికి మార్చి 31ని మెట్రో స్వాధీన తేదీ అనుకున్నప్పటికీ ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి రుణం గడువును ఏప్రిల్ 30కి పొడిగించారు. ఈ తేదీ నాటికి ఎల్‌అండ్‌టీ మెట్రోరైలు లిమిటెడ్ అప్పు రూ. 13,615 కోట్లకు చేరింది. ఈ మొత్తాన్ని ప్రభుత్వం ఐఆర్‌ఎఫ్‌సీ నుంచి 3.5 నుంచి 4 శాతం వడ్డీకి తీసుకుని రుణాలను రీషెడ్యూల్ చేయనుంది. మిగిలిన రూ. 1,385 కోట్లను హెచ్‌ఎండీఏ నుంచి ఈక్విటీగా ఎల్‌అండ్‌టీకి ప్రభుత్వం చెల్లించనుంది. దీనికి సంబంధించి కీలకమైన వాటా కొనుగోలు ఒప్పందంపై సీఎం సమక్షంలో అధికారులు సంతకాలు చేయనున్నారు. దీంతో పీపీపీలో ఉన్న హైదరాబాద్ మెట్రో మొదటి దశ ప్రభుత్వ పరం కానుంది. అన్నీ అనుకూలిస్తే బుధ లేదా గురువారాల్లో ఒప్పందాలపై సంతకాలు ఉంటాయని అధికార వర్గాలు తెలిపాయి.

## ఐదు రాష్ట్రాల్లో బీజేపీ విజయం ఖాయం..

### మే 4న ఫలితాలు చరిత్ర సృష్టిస్తాయ్:మోడీ



ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ బుధవారం ఉత్తరప్రదేశ్‌లోని హార్దోయ్ జిల్లాలో గంగా ఎక్స్‌ప్రెస్‌వేను ప్రారంభించారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల రెండో దశ పోలింగ్ జరుగుతున్న నేపథ్యంలో మోడీ మాట్లాడుతూ, బీహార్ అసెంబ్లీ ఎన్నికలు, గుజరాత్ స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత ఐదు రాష్ట్రాల్లో (తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళ, అస్సాం) ఒక కేంద్రపాలిత ప్రాంతం (పుదుచ్చేరి)లో బీజేపీ హ్యాట్రిక్ విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇటీవల బీహార్‌లో ఎన్నికలు జరిగినప్పుడు బీజేపీ–ఎన్‌డీఏ భారీ విజయం సాధించి చరిత్ర సృష్టించింది. నిన్న గుజరాత్ మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, జిల్లా పంచాయతీలు, నగర పంచాయతీలు, తహసీల్ పంచాయతీల ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. బీజేపీ 80 నుంచి 85 శాతం మున్సిపాలిటీలు, పంచాయతీల్లో విజయం సాధించింది. ఈ ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో కూడా బీజేపీ చారిత్రక హ్యాట్రిక్ విజయాలను పూర్తి చేస్తుందని నేను విశ్వసిస్తున్నాను. మే 4 ఫలితాలు అభివృద్ధి భారత్ కోసం ఇంకా బలం చేకూరుస్తాయి. దేశ అభివృద్ధి వేగానికి కొత్త ఉత్సాహం నింపుతాయి" అని ప్రధాని మోడీ తెలిపారు. బెంగాల్‌లో రెండో దశ పోలింగ్‌లో భారీగా ఓటర్లు తరలివచ్చారని, భయం లేని వాతావరణంలో ఓటింగ్ జరుగుతోందని మోడీ ప్రశంసించారు. ఇది భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యం బలోపేతం అవుతున్నట్లు సంకేతమని వ్యాఖ్యానించారు.

## నేను బీఆర్ఎస్‌లోనే ఉన్నాను

### పార్టీ మార్పుపై మాజీ మంత్రి మల్లారెడ్డి కీలక వ్యాఖ్యలు..



**హైదరాబాద్,ఏప్రిల్ 29:** బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి మల్లారెడ్డి పార్టీ మార్పు ప్రచారంపై తీవ్రంగా స్పందించారు. తాను బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నానని స్పష్టం చేస్తూ సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారాలను ఖండించారు. ఇటీవల ప్రధాని నరేంద్ర మోడీ సమావేశానికి హాజరైన నేపథ్యంలో మల్లారెడ్డి పార్టీ మారబోతున్నారనే ప్రచారం సోషల్ మీడియాలో జోరుగా సాగింది. దీనిపై స్పందించిన ఆయన, ప్రధానిని కలిసినంత మాత్రాన పార్టీ మారినట్లు కాదని హితవు పలికారు.. తాను ఇప్పటికీ బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నానని మల్లారెడ్డి మరోసారి స్పష్టం చేశారు. నిరాధార ఆరోపణలకు సమాధానం చెప్పాల్సిన అవసరం తనకు లేదని వ్యాఖ్యానించారు.పార్టీ మార్పు ప్రచారంపై మీడియా ప్రతినిధులు ప్రశ్నలు అడిగిన సందర్భంగా కొంత ఆవేశంగా స్పందించిన మల్లారెడ్డి, సోషల్ మీడియా ప్రచారాలపై ప్రతి సారి వివరణ ఇవ్వాల్సిన అవసరం లేదని పేర్కొంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. మల్లారెడ్డి వ్యాఖ్యలతో ఆయన పార్టీ మార్పుపై వస్తున్న ఊహాగానాలకు తాత్కాలికంగా తెరపడినట్లైంది. అయితే, రాజకీయ వర్గాల్లో మాత్రం ఈ అంశంపై చర్చ కొనసాగుతోంది. మరోవైపు మల్లారెడ్డి కోడలు ప్రీతిరెడ్డి ఇటీవల ప్రధాని నరేంద్ర మోడీపై ప్రశంసలు గుప్పించారు. దీంతో ఆమె బీజేపీ వైపు అడుగేస్తారనే చర్చ మొదలైంది. ఇదిలా ఉండగా.. ప్రీతిరెడ్డి ఈ మధ్య బీజేపీ పార్టీ ఆఫీస్‌కు వెళ్లారు ఇది కూడా పెద్ద చర్చగా మారిన విషయం విదితమే కాగా.. ఇది మర్యాదపూర్వక భేటీనేనని ప్రీతిరెడ్డి క్లారిటీ ఇచ్చారు.. మల్లారెడ్డి యూనివర్సిటీలో ఏఐ క్యాంపస్ ఓపెనింగ్‌కు ప్రధాని మోడీని ఆహ్వానించాం.. మోడీని ఆహ్వానించాం కాబట్టే ఆ పార్టీ నేతలను ఇప్పుడు కలుస్తున్నాం.. బీజేపీనే కాదు.. అన్ని పార్టీల నేతలను కలిసి ఆహ్వానిస్తున్నామంటూ ప్రీతిరెడ్డి స్పష్టం చేసిన విషయం విదితమే..

## ప్రజల గడప వద్దకే పరిపాలన': మంత్రి పొంగులేటి



కూసుమంచి: బుధవారం మండలంలోని పాలేరు గ్రామంలోని జవహర్ నవోదయ విద్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజల ఆశలను గత పాలకులు విస్మరించడంతో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అధికారులు ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు పరిష్కరించేలా అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. గతంలో ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగినా సమస్యలు పరిష్కారం కాలేదని, ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రజాపాలన కార్యక్రమం ద్వారా అధికారులను ప్రజల వద్దకు పంపించి దరఖాస్తులు స్వీకరించి సమస్యలు పరిష్కరించామని అన్నారు. ప్రజాపాలనకు రెండేళ్లు పూర్తైన సందర్భంగా మరోసారి 99 రోజుల ప్రజా ప్రగతి ప్రణాళికను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశాం.. పాలేరు నియోజకవర్గంలో ప్రతి మండలాన్ని మూడు క్లస్టర్లుగా విభజించి, ప్రతి క్లస్టర్ పరిధిలో 10 నుంచి 13 గ్రామ పంచాయతీలను చేర్చి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు.

## ఇకపై మంచివాడిగా ఉండను

### ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక



వాషింగ్టన్:అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రరూపం దాల్చుతున్నాయి. అణు ఒప్పందం, హార్ముజ్ జలసంధి మూసివేతపై ఇరాన్ వ్యవహరిస్తున్న తీరుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ మేరకు బుధవారం తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ' వేదికగా ఇరాన్‌కు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. 'ఇరాన్‌కు అణు ఒప్పందం ఎలా చేసుకోవాలో తెలియడం లేదు. వారు ఇకనైనా తెలివిగా వ్యవహరిస్తే మంచిది' అని ట్రంప్ హితవు పలికారు. చేతిలో ఆటోమేటిక్ రైఫిల్ పట్టుకుని, వెనుక భారీ పేలుళ్లు జరుగుతున్నట్లుగా ఉన్న తన ఎడిటెడ్ ఏఐ ఫోటోను షేర్ చేస్తూ.. 'ఇకపై నేను మంచివాడిగా ఉండను అని క్యాప్షన్ జత చేశారు. ఇరాన్ ప్రతిపాదించిన ఒప్పందంలో అణు కార్యక్రమాల ప్రస్తావన లేకపోవడం పట్ల ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఫిబ్రవరి చివర్లో అమెరికా, ఇజ్రాయెల్ దాడుల అనంతరం ఇరాన్.. ప్రపంచ చమురు, గ్యాస్ రవాణాలో (దాదాపు 20%) కీలకమైన హార్ముజ్ జలసంధిని దిగ్బంధించింది. దీనివల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీవ్ర కుదుపులకు లోనైంది. అయితే, భద్రతా కారణాల దృష్ట్యా జలసంధిలో తగిన చర్యలు తీసుకునే హక్కు తమకుందని, నావికా స్వేచ్ఛకు సంబంధించిన 1982 నాటి ఐరాస సముద్ర జలాల ఒప్పందం తమకు వర్తించదని ఇరాన్ స్పష్టం చేసింది. ఇరాన్ చమురు ఎగుమతులను అడ్డుకునేందుకు అమెరికా నావికా దిగ్బంధనాన్ని కొనసాగిస్తోంది. అమెరికా ఆంక్షలతో ఇరాన్ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలే స్థితికి చేరుకుందని ట్రంప్ పేర్కొన్నారు.

## ఆందోళన పడొద్దు

## పెట్రోల్,డీజిల్ సరఫరాపై మంత్రి ఉత్తమ్



**హైదరాబాద్,ఏప్రిల్ 29:** పెట్రోల్, డీజిల్ నిల్వలకు సంబంధించి సామాన్య ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఇంధన కొరత ఏర్పడుతుందనే వదంతులను నమ్మవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇవాళ నగరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని పెట్రోల్ బంకుల్లో సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని మంత్రి తెలిపారు. చమురు కంపెనీలతో తాము నిరంతరం మాట్లాడుతున్నామని.. సరఫరాలో ఎక్కడా ఆటంకాలు కలగకుండా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ముఖ్యంగా వ్యవసాయ అవసరాలకు ప్రాధాన్యత నిస్తూ, రైతులకు డీజిల్ కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఇంధన సరఫరాను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేసిందని ఉత్తమ్ తెలిపారు. పెట్రోల్, డీజిల్ సరఫరాలో ఇబ్బందులు ఎదురైనా లేదా ఎవరైనా కృత్రిమ కొరత ఫిర్యాదు చేసేందుకు టోల్ ఫ్రీ నెంబర్ 1967కు కాల్ చేయాలన్నారు. ప్రతి జిల్లాలో కలెక్టర్ల ఆధ్వర్యంలో మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేశామని వివరించారు. ఈ కమిటీలు జిల్లాలోని పెట్రోల్ బంకుల వద్ద నిల్వలను, సరఫరాను నిరంతరం పర్యవేక్షిస్తాయి పేర్కొన్నారు.

## సువేందును చుట్టుముట్టిన టీఎంసీ మద్దతుదారులు.. స్వల్ప లాఠీచార్జి



కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల రెండో విడత పోలింగ్ ఏడు జిల్లాల్లోని 142 నియోజకవర్గాల్లో చురుకుగా జరుగుతోంది. బెంగాల్ ప్రతిపక్ష నేత, భవానీపూర్ బీజేపీ అభ్యర్థి సువేందు అధికారి ఎన్నికల ఏర్పాట్లు తనిఖీ చేసేందుకు బుధవారం ఒక పోలింగ్ బూత్ వద్దకు చేరుకున్నప్పుడు ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. టీఎంసీ మద్దతుదారులు అక్కడకు చేరుకుని 'జై బెంగాల్' నినాదాలు చేశారు. దీంతో స్థానిక పోలీసులు, సీఆర్‌పీఎఫ్ వెంటనే జోక్యం చేసుకుని స్వల్పంగా లాఠీచార్జి జరిపి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. వాళ్లంతా భయంతో వణుకుతున్నారని, మమత బెనర్జీ చిత్తుగా ఓడిపోవడం ఖాయమని అన్నారు. పోలింగ్ బూత్ వద్ద తలెత్తిన ఉద్రిక్తతను వెంటనే అదుపులోకి తెచ్చామని, ఎలాంటి అవంతారాలు లేకుండా అన్ని నియోజకవర్గాల్లోనూ పోలింగ్ చురుకుగా, ప్రశాంతంగా జరుగుతోందని అధికారులు తెలిపారు.

# సంపాదకీయం

## ఏఐతో భవిష్యత్తు..




నలభై ఆరేళ్ల క్రితం అంటే 1980లో దేశంలో కంప్యూటరీకరణను విస్తరింప చేయాలని ప్రభుత్వం నిర్ణయించగా ఆందోళనలు తలెత్తాయి. 1984 సంవత్సరాన్ని 'యాంటీ కంప్యూటరైజేషన్ సంవత్సరం'గా పరిగణించారు. దీంతో తమ ఉద్యోగాలు పోతాయని, ఆర్థికంగా దెబ్బతింటాయని, దేశంలో తీవ్ర పరిస్థితులు తలెత్తుతాయని కార్మికులు నిరసన ప్రదర్శనలు సాగించారు. అయితే రానురాను డిజిటల్ టెక్నాలజీని అమలు లోకి విస్తారంగా తీసుకు రావడంతో సమాజంలోని అన్ని వర్గాల్లో, దేశం మొత్తం మీద ఆలోచనల్లో మార్పు రావడం ప్రారంభమైంది. కంప్యూటర్లు, ఆధునిక సాంకేతికత భారీగా ఉద్యోగాలు కల్పిస్తాయని, జీవితంలో అనేక విధాలుగా ఉపయోగపడతాయని నమ్మకం పెరిగింది. ఎఐ (కృత్రిమ మేధ) ఆధునిక ప్రపంచంలో కీలకమైన కేంద్రంగా వర్ధిల్లుతోంది. ఇప్పుడు ఎక్కడ విన్నా ఎఐ గురించే చర్చ వినిపిస్తోంది. మానవ చరిత్రలో ఇప్పటివరకు ఎన్నో పెద్దమార్పులు వచ్చాయి. కానీ ఇప్పుడు ఎఐ అన్నది అత్యంత శక్తివంతమైన, అతి గొప్ప ఆవిష్కరణల్లో ఒకటిగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రపంచ సాంకేతిక నాయకత్వంలో భారత్ అగ్రస్థానం సాధించాలన్న లక్ష్యంతో ఢిల్లీలోని భారత్ మండపంలో 'ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్' ప్రారంభం కావడం చెప్పుకోదగిన ఘట్టం. ఎఐ యుగం నియమాలు, ప్రమాణాలు, అవకాశాలను రూపొందించడంలో మనదేశం కీలకంగా ఉండాలనే ప్రధాన లక్ష్యంతో ఏర్పాటైన ఈ సదస్సు గురించి ప్రధాని మోడీ ఆశాభావం వ్యక్తం చేశారు. డిజిటల్ సదుపాయాల కల్పన, శక్తివంతమైన స్టార్టప్‌ల ఏర్పాటు, అత్యాధునిక పరిశోధనలు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాల్లో భారత్ బాధ్యత మరింత పెరగనుందని వెల్లడించడం గమనార్హం. ఇప్పటికే దేశంలో ఆరోగ్య సంరక్షణ, విద్య, వ్యవసాయం, పరిపాలన, వంటి అనేక రంగాల్లో ఎఐ కీలక పాత్ర పోషిస్తోంది. ఇప్పుడు 22 రంగాల్లోని 17 రంగాల కంపెనీలు తమను తాము ఎఐ సాంతికత దిశగా మార్చుకోవలసిన ఒత్తిడి ఎక్కువగా ఉంది. ఎఐతో ఎక్కువ అనుబంధం ఉన్న ఐటి వంటి రంగాల్లో పెద్ద మార్పులు వస్తున్నాయి. మైక్రోసాఫ్ట్ ఎఐ సిఇఒ ముస్తఫా సులేమాన్ వచ్చే 18 నెలల్లో కంప్యూటర్ ఉద్యోగాలన్నీ ఎఐతో భర్తీ అవుతాయని అంచనా వేశారు. ఎఐ వల్ల 2035 నాటికి ప్రపంచ జిడిపి (స్థూల దేశీయోత్పత్తి) లో 15 శాతం పాయింట్లు పెరగవచ్చని ఏడాది క్రితం ప్రైస్ వాటర్ హౌస్ కూపర్స్ అనే సంస్థ అంచనా వేసింది. అంటే ప్రతి సంవత్సరం సుమారు 1 శాతం అదనపు అభివృద్ధి తథ్యమన్న అంచనాలు వెలువడ్డాయి. ఈ సదస్సు ఒక బలీయమైన జాతీయ ఎఐ పర్యావరణ వ్యవస్థను నిర్మించడానికి మాత్రమే ప్రయత్నించకుండా ప్రపంచ దక్షిణార్థ దేశాలను కూడా ఇందులో భాగస్వాములను చేయాలన్న తపన కనిపిస్తోంది. ఆయా దేశాలు కృత్రిమ మేధపై తమ ప్రణాళికలను ఈ వేదికపై వెల్లడించే అవకాశం కనిపిస్తోంది. అయితే ఎఐ ప్రణాళికలకు సంబంధించి భారత్ ముందు అనేక సవాళ్లు ఉన్నాయి. ఈ సాంకేతికతకు కావలసిన కనీస సెమీ కండక్టర్లు లేదా కంప్యూటర్ చిప్‌లు తయారు చేసే సామర్థ్యం ఇంకా భారత్‌కు అలవడ లేదు. ప్రస్తుతం దేశంలో ఎఐ సంపూర్ణ సామర్థ్యంతో ఏ కంపెనీ లేదు. అలాగే మెగా డేటా సెంటర్లు లేవు. పాత్రధారులు, నాటకం స్క్రిప్టు, కనీసం వేదిక లేకుండా ఏదైనా నాటకం ఎలా ప్రదర్శించలేరో అలాగే క్షేత్రస్థాయిలో కనీస మౌలిక అవసరాలులేకుండా ఎఐ సాంకేతికతను సాధించడం కష్టతరమే. అయినప్పటికీ ఎఐకి అనుకూలమైన పర్యావరణ వ్యవస్థ గత కొన్నేళ్లుగా ఏర్పడి చిగుళ్లు మొలకెత్తడం ప్రారంభమైంది. రెండేళ్లుగా సెమీకండక్టర్ల తయారీ అత్యంత నాటకీయంగా ఆవిర్భావమైంది. ఈ ఏడాది జనవరి నాటికి దేశం లోని ఆరు రాష్ట్రాల్లో 10 సెమీ కండక్టర్ తయారీ ప్రాజెక్టులు వచ్చాయని, వీటిలో కొన్ని ఆన్‌లైన్‌లో ఉన్నాయని ప్రభుత్వం అంచనాగా చెబుతోంది. ఇక రెండో అంశం.. దేశంలో మెగా డేటా సెంటర్ల ఏర్పాటును ప్రోత్సహించడం గత ఏడాది గూగుల్, అమెజాన్, మైక్రోసాఫ్ట్, డిజిటల్ కనెక్షన్, తదితర ప్రపంచ స్థాయి సాంకేతిక సంస్థలు 2030 వరకు ఎఐ, క్లౌడ్ మౌలిక సదుపాయాల్లో దాదాపు 68 బిలియన్ డాలర్ల వరకు పెట్టుబడులు పెట్టడానికి నిర్ణయం తీసుకున్నాయి. ఈ మేరకు చిప్ డిజైన్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ పర్యావరణం నెలకొల్పేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే చెప్పవచ్చు. ఈ సమయంలో ప్రభుత్వం నుంచి సరైన ప్రోత్సాహం లభిస్తేనే ఊపందుకుంటుంది. ఆయా ప్రపంచ స్థాయి సాంకేతిక సంస్థల అధినేతలు భారతదేశ సామర్థ్యం గురించి ఆశావహులుగా ఉన్నారు. జెన్‌సెన్ హుయాంగ్, గూగుల్ సిఇఒ సుందర్‌పిచాయ్, తదితరులు భావితరానికి ఎఐ సాంకేతిక కేంద్రంగా భారత్ వర్ధిల్లుతుందని, ఎఐని భారత్ ముందుకు తీసుకెళ్తుందని అభిప్రాయాలతో దృఢమైన విశ్వాసం వెలిబుచ్చడం గమనార్హం. భారత్‌లో మానవ వనరులకు లోటు లేదని, ఎఐ అమలు స్థాయి మరింత ముందుకు వెళ్తుందని చెబుతున్నారు. ఇప్పటికే ఎఐ ఫ్రంట్రన్నర్ చాట్ జిపిటిలో ప్రపంచం మొత్తం మీద రెండో భారీ మార్కెట్‌గా భారత్ ఉంటోందని ఆ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ సామ్ అల్ట్‌మాన్ అంగీకరించారు. ఎఐ నమ్మదగిన ముఖ్యమైన మార్కెట్‌గా అభివర్ణించారు. ఇవన్నీ ఎఐ సంస్థలకు భారత్ ఆకర్షణీయ కేంద్రంగా మారుస్తున్నాయి. ఏఐ వల్ల పలు ఉద్యోగాలకు పోతాయని ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ప్రముఖ బిలియనీర్, పారిశ్రామిక వేత్త వినోద్ ఖోస్లా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏఐ టూల్స్ రాబోయే ఐదేళ్లలో ఐటీ సేవలు, బీపీఓ ఉద్యోగాలు దాదాపు కనమరుగవుతాయని అంచనా వేశారు. రానున్న 15 ఏళ్లలో నైపుణ్య ఆధారిత వృత్తులు తుడిచిపెట్టుకుపోతాయని హెచ్చరించారు. అయితే విద్య, వైద్య సంరక్షణ అందరికీ అందుబాటులో వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 నేపథ్యంలో హిందుస్థాన్ టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వినోద్ ఖోస్లా మాట్లాడారు. బిపిఓ లేదా బిజినెస్ ప్రాసెస్ అవుట్‌సోర్సింగ్ అనేది కంపెనీలు థర్డ్-పార్టీ సర్వీస్ ప్రొవైడర్లకు అవుట్‌సోర్స్ చేసే లార్జ్ సెగ్మెంట్ వర్క్‌ను సూచిస్తుంది. సిస్టమ్స్ ఆర్థికంగా విలువైన పనులలో మానవులను అధిగమించగల స్థితికి వేగంగా చేరుకుంటున్నాయని ఆయన తెలిపారు. ఏఐ అనేది డిజిటల్ అసిస్టెంట్స్ నుండి అటానమస్ ఏఐ వర్కర్క్ దిశగా మారుతుందని, అకౌంటింగ్, లా, మెడిసిన్, చిప్ డిజైన్ వంటి రంగాలు మరో దశాబ్దకాలంలో ఏఐ వల్ల ప్రభావితం కావచ్చని తెలిపారు. ఈ తరుణంలో ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ ఢిల్లీలో ప్రారంభం కావడం శుభోదయమే.

# కార్పొరేట్ స్వామ్యం




మన దేశ ఎన్నికల వ్యవస్థలో రాజకీయ అధికారానికి డబ్బుకు మధ్య ఉన్న అనుబంధం కొత్త కాదు కానీ నరేంద్ర మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వ హయాంలో ఈ బంధం కొత్త పుంతలు తొక్కింది. ఇది ఎంత వికృతంగా మారిందో, ఎంతగా వ్యవస్థాకృతమైందో ఇప్పుడు స్పష్టంగా బయటపడుతోంది. 2024 ఫిబ్రవరిలో ఎన్నికల బాండ్లను రాజ్యాంగ విరుద్ధమని కొట్టివేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు గోప్యతగా సాగిన రాజకీయ నిధుల (ఎలక్టోరల్ బాండ్స్) తీరును బట్టబయలు చేసింది. సొంత ప్రయోజనాల కోసం అధికారంలో ఉన్న పార్టీతో కుమ్మక్కు కావడం, లేదా వ్యవస్థలను ఎక్కడ ఉసిగొల్పుతుందోనన్న భయమో ఆ నిధుల వెల్లువకు కారణమని స్పష్టమైంది. అయితే ఆ తీర్పు తర్వాత పరిణామాలు చూస్తే నిధుల ప్రవాహం ఏమాత్రం తగ్గలేదని, మార్గం మాత్రమే మారిందని అర్థమవుతోంది. ఎన్నికల కమిషన్ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం 2024-25లో రాజకీయ పార్టీలకు వచ్చిన మొత్తం విరాళాల్లో 85 శాతం ఒక్క బిజెపికే దక్కాయి. గత ఏడాది ఇది 56 శాతమే. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే బిజెపికి ఆరువేల కోట్ల రూపాయ లకు పైగా నిధులు లభించాయి. ఇది ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీకి వచ్చిన నిధులతో పోల్చుకుంటే దాదాపు 12 రెట్లు ఎక్కువ! మరికొన్ని పార్టీలకూ కొంత మొత్తం నిధులు సమకూరినా అవి అడుగు, బొడుగే! కార్పొరేట్ల నుండి ఏ రూపంలోనూ నిధులు స్వీకరిం చేది లేదని సిపిఎం ఇప్పటికే ప్రకటించి అమలు చేస్తున్న విషయాన్ని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అయితే, కార్పొరేట్ రంగమంతా తన పెట్టుబడులను అధికారపార్టీ వైపునకు మళ్ళించడమే ఇక్కడ ముఖ్యమైన అంశం. అలా ఎందుకు జరిగిందన్నదే కీలక ప్రశ్న! 2018 నుంచి 2024 వరకు కొనసాగిన ఎన్నికల బాండ్ల వ్యవస్థలోనూ బిజెపినే ప్రధాన లబ్ధిదారు. ఈ పథకం, కార్పొరేట్లకు పూర్తి గోప్యత కల్పించింది. భయం లేకుండా విరాళాలు ఇవ్వడం, తమకు కావాల్సిన పని చేయించుకోవడం ఇదే ఆ వ్యవస్థ యొక్క అసలు రూపం. సుప్రీం తీర్పుతో ఈ విధానం రద్దు అయినట్టు కనపడినప్పటికీ పరోక్షంగా అదే కొనసాగుతోంది. తేడా ఏమిటంటే, బాండ్లకు బదులుగా ఎన్నికల ట్రస్టుల ద్వారా విరాళాలు వెళుతున్నాయి. పార్టీకి, విరాళమిచ్చే సంస్థకు మధ్య ఉన్న సంబంధాన్ని కొత్త మార్గం కూడా పూర్తిగా మూసివేయడం లేదు. ధన ప్రవాహాన్నీ, దాని గోప్యతను ఏమాత్రం మార్చలేదు. దీని అర్థం సుప్రీంకోర్టు ఒక తలుపు మూస్తే, కార్పొరేట్ రాజకీయాలు మరో తలుపును తెరుచుకున్నాయనే! ప్రూడెంట్, ప్రోగ్రెసివ్, ఎబి జనరల్ వంటి ఎన్నికల ట్రస్టుల వెనుక దేశంలోని అతి పెద్ద కార్పొరేట్ సంస్థలు ఉండటం ఈ వాస్తవాన్నే ఎత్తి చూపుతున్నాయి. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు నెలల్లోనే బిజెపికి విరాళాలు విపరీతంగా పెరగడమే దీనికి నిదర్శనం. ఇక్కడ అసలు ప్రమాదం ప్రజాస్వామ్యానికి కలిగే నష్టం. ఒకే పార్టీ వద్ద అపారమైన ఆర్థిక వనరులు కేంద్రీకృతమైతే ఎన్నికలలో పోటీ సమానస్థాయిలో ఉండదు. ఏకపక్ష ప్రచారం సాగుతుంది. మీడియా కథనాలు సైతం వక్రీకరణకు గురవుతాయి. కాబట్టి ప్రజలు వాస్తవాలను తెలుసుకోలేరు. ఈ వికృత ధోరణిని మీడియా లో ఇప్పటికే చూస్తున్నాం. ఓటర్లను ప్రలోభపెట్టడం విపరీతంగా సాగుతుంది. ప్రభుత్వాల విధాన నిర్ణయాలు విరాళాలు ఇచ్చిన అస్మదీయుల ప్రయోజనాలకే ఉపయోగపడతాయి. చివరకు పరిపాలన తీరు ఆర్థిక లావాదేవీగా మారుతుంది. ఆశ్రిత పెట్టుబడిదారీ విధానపు అవలక్షణం 'నీకింత నాకింత' సర్వసాధారణమౌతుంది. ప్రభుత్వం ప్రజలకు చేయాల్సిన సేవలు కూడా సరుకులుగా మారి సామాన్యులను వెక్కిరిస్తాయి. ఎన్నికల బాండ్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగపరమైన దిద్దుబాటు చర్య. కానీ, కార్పొరేట్ రాజకీయాలతో కలుషితమైన వ్యవస్థను ప్రక్షాళన చేయడానికి అది మాత్రమే చాలదన్న విషయాన్ని తాజా పరిణామాలు తేల్చి చెబుతున్నాయి. ఇప్పటికైనా ఎన్నికల నిధుల విధానంపై పునరాలోచన చేయాలి. పూర్తి స్థాయి పారదర్శకతను తీసుకురావాలి. రాజకీయ పార్టీలకు కార్పొరేట్లు విరాళాలివ్వడానికి బదులుగా, పార్టీల ఎన్నికల ఖర్చును అంతకు ముందరి ఎన్నికల్లో వారి ప్రజాబలాన్ని బట్టి ప్రభుత్వమే సమకూర్చడం, దామాషా ఎన్నికలు వంటి సంస్కరణలు రావాలి. ప్రజానుకూల ఎన్నికల సంస్కరణల కోసం పాలకులపై పౌరసమాజం ఒత్తిడి తీసుకురావాలి. లేనిపక్షంలో ప్రజాస్వామ్యం కార్పొరేట్ స్వామ్యంగా మారిపోతుంది.

# సేవ్ ఆరావళి కోసం ఉద్యమించాలి !



ఇప్పటికే ప్రకృతి విధ్వంసం యధేచ్ఛగా సాగుతోంది. దేశంలో ప్రకృతిని రక్షించాలన్న బాధ్యత ప్రభుత్వాలకు లేకుండా పోయింది. యధారాజా తథా ప్రజా అన్నట్లుగా ప్రజలు కూడా ఈ విధ్వంసంలో పాలుపంచుకుంటున్నారు. గ్రామాల్లో చెరువులు, కుంటలు, చిన్నచిన్న గుట్టలు మాయం అవుతున్నాయి. ఇసుకను తోడేస్తున్నారు. అడవులను ధ్వంసం చేస్తున్నారు. దీని ప్రభావంతో వాతావరణ మార్పులు తీవ్రంగా చోటుచేసు కుంటున్నాయి. దీనికతోడు విపరీతమైన ప్లాస్టిక్ ఎక్కడ పడితే అక్కడ గుట్టలుగా పేరుకుపోతోంది. చెరువులు, నదులు, సముద్రాలు కలుషితం అవుతున్నా ప్రభుత్వాల్లో చీమకుట్టినట్లుగా కూడా లేదు. దీంతో పర్యావరణంతో పాటు ప్రజల ఆరోగ్యం దెబ్బతింటున్నా కఠిన చర్యలు తీసుకోవడం లేదు. దీనికితోడు ప్రకృతి విధ్వంసం ఆపాల్సిన ప్రభుత్వాలు చోద్యం చూడడమే గాకుండా ప్రృకృతిని విధ్వంసం చేస్తున్నాయి. ఆంధ్రాలో సముద్రతీరంలో ఉన్న మడ అడువులను ధ్వసం చేశార. అలాగే రుషికొండను ధ్వంసం చేసి జగన్ విలాసవంతమైన భవనాలు కట్టుకున్నాడు. కొల్లేరు సరస్సు పూర్తిగా ధ్వంసం అయ్యింది. హైదరాబాద్ లో హుస్సేన్ సాగర్ కాలుష్య కాసారంగా మారింది. ఇవన్నీ కొన్ని మాత్రమే. ఎందరో ఆందోళనలు చేసినా, చిప్కో లాంటి ఉద్యమాలు వచ్చినా కదలిక రాకపోవడం దారుణం కాక మరోటి కాదు. కేరళ విలయం చూసిన తరవాత కూడా ప్రభుత్వాలు కళ్లు తెరవడం లేదు. ఉత్తరాఖండ్ విలయం చూసినా కొండలను విధ్వంసం చేయడం ఆపడం లేదు. తాజాగా ప్రకృతి నిర్మించిన రక్షణ కవచం ఆరావళి పర్వత శ్రేణులను

కూడా విధ్వంసం చేసే కార్యక్రమం మొదలు కావడం ఈ దేశం చేసుకున్న దౌర్భాగ్యం తప్ప మరోటి కాదు.

అటవీ, జల, ఖనిజ ఇతర సహజ వనరులను అందిస్తూ.. నాలుగు రాష్ట్రాల సామాజిక, ఆర్థిక ప్రగతికి దోహద పడుతున్న ఆరావళిలోని 90 శాతం ప్రాంతాలకు మైనింగ్, రియల్ ఎస్టేట్ ముప్పు పొంచి వుంది. దేశ రాజధాని ఢిల్లీతోపాటు హర్యానా, రాజస్థాన్, గుజరాత్ వరకూ దాదాపు 700 కిలోమీటర్ల మేర విస్తరించివున్న ఈ పర్వత శ్రేణి థార్ ఎడారి నుంచి వచ్చే ఇసుక, ధూళిని అడ్డుకోవడంలో కీలకమైనవని ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా నివేదిక స్పష్టం చేస్తోంది. యూరోపియన్ దేశాల్లో ప్రకృతిని రక్షించేందుకు పాటుపడుతుంటే, మనం మాత్రం విధ్వంస రచన చేస్తున్నాం. మైనింగ్, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు దోచిపెట్టేందుకు కేంద్రం రంగం సిద్ధం చేస్తున్నట్లుగా వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి.. వందల కోట్ల సంవత్సరాల క్రితం ఆవిర్భవించిన ప్రపంచంలోనే అతి పురాతన మడత పర్వత శ్రేణుల్లో ఒకటైన ఆరావళిని విధ్వంసం చేసుకోవ డమంటే మనదేశాన్ని మనం నాశనం చేసుకోవడమే. కూర్చున్న కొమ్మను నరుక్కోవడమే అవుతుంది. ఇక్కడ ఖనిజాల కోసం పర్వత శ్రేణులను ధ్వంసం చేసే యత్నాలు అడ్డుకోవాల్సిందే. ఇక్కడ తవ్వకాలకు ఆమోదం తెలపడం అంటే పర్యావరణానికి, జీవ కారుణ్యానికే కాదు.. మానవ మనుగడకే ప్రమాదకరంగా భావించాలి. సామాజిక మాధ్యమ వేదికల్లో ఉత్తరాదిన ప్రారంభమైన 'సేవ్ ఆరావళి క్యాంపెయిన్' రోజురోజు కూ దేశవ్యాప్తంగా విస్తరిస్తోంది. ఉత్తర భారతానికి పచ్చని పరుపులా ఉన్న ఆరావళిని కాపాడాలన్న హ్యాష్ ట్యాగ్‌లతో విద్యావంతులు, మేధావులు, పర్యావరణ వేత్తలు, నిపుణులు ముక్తకంఠంతో నినదిస్తున్నారు. అక్రమ మైనింగ్‌ను ఎలా చట్టబద్ధం చేస్తారని కేంద్రాన్ని నిలదీస్తున్నారు. పీపుల్ ఫర్ ఆరావలీస్' సంస్థ ఇచ్చిన నివేదిక ప్రకారం అనూహ్యంగా పెరిగిన పట్టణీకరణ, ఖనిజాన్వేషణలతో అడవుల్లో ముమ్మరంగా సాగుతున్న తవ్వకాలు, నివాస ప్రాంతాల విస్తరణ వల్ల హర్యానా, రాజస్థాన్‌లోని ఛార్ఖీ దాద్రి, భివాని జిల్లాల్లో పర్వతాలు ధ్వంసమై జీవవైవిధ్యం నాశనమైంది. ఒక్క రాజస్థాన్‌లోనే దాదాపు 25శాతం కొండలు హరించుకు పోయాయని 2018లోనే సుప్రీంకోర్టు నియమించిన కేంద్ర సాధికార సంఘం తేల్చిచెప్పింది. 25 వేలకుపైగా ఎకరాల్లో కొండలు కనుమరుగయ్యాయి. 2011-17 మధ్యలో ఆరావళి శ్రేణుల నుంచి 9.80 లక్షల టన్నుల ఖనిజ వనరులను అక్రమంగా తరలించారనేది కాగ్ నివేదిక తెలిపింది. మైనింగ్, రియల్ ఎస్టేట్ అక్రమాలపై నాలుగు వేలకుపైగా కేసులు న్యాయస్థానాల్లో మూలుగున్నాయి. హర్యానాలోని ఫరీదాబాద్ పరిసర ప్రాంతాల్లో ఖనిజ తవ్వకాలను 2002లోనూ, నాలుగు రాష్ట్రాల్లో తవ్వకాలను 2009లోనూ నిషేధిస్తూ సుప్రీంకోర్టు తీర్పులిచ్చినా అమలు చేసే బాధ్యతల నుంచి ప్రభుత్వాలు తప్పుకున్నాయి. పర్వతాల స్వరూపం మార్చకూడదన్న సుప్రీంకోర్టు తాజా ఆదేశాలు చుట్టూ మైనింగ్ జరుగుతుంటే ఎలా అమలవు తాయన్న ఆలోచన చేయడం లేదు. ఢిల్లీ నుంచి థార్ వరకూ ఎడారిగా మారుతుందని, భూగర్భ జలాలు అడుగంటతాయని, వాయు కాలుష్యంతో ఢిల్లీసహా ఆయా రాష్ట్రాల నుంచి వలస పోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందంటున్న పర్యావరణవేత్తల హెచ్చరికలు పాలకుల చెవికెక్కడం లేదు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్ 5న 'ఆరావళి గ్రీన్‌వాల్ ప్రాజెక్టు'ను ప్రారంభించిన ప్రధాని ఢిల్లీ నుంచి గుజరాత్ వరకూ అడవులు పెంచడమే లక్ష్యమన్నారు. వేలాది ఏళ్ళుగా పర్యావరణానికి పెట్టని కోటగా ఉన్న ఆరావళిని కాపాడుకోవడం, భవిష్యత్ తరాలకు భద్రంగా అప్పగించడం, 'సేవ్ ఆరావళి'కి మద్దతు పలకడం మనందరి బాధ్యత. అత్యుత్సాహం చూపే పర్యావరణ వినాశక చర్యలకు అడ్డుకట్ట పడాలి. పర్యావరణ విధ్వంసం చేసే ఎలాంటి చర్యలనైనా ప్రజలు ప్రతిఘటించాలి. మనకెందుకులే అనుకుంటే రేపటి మనతరం అంతం కావడం ఖాయం.



# ఆర్జి.1 ఏరియా ఆధ్వర్యం లో మల్కాపూర్ గ్రామములో ఉచిత మెడికల్ క్యాంప్



(తెలంగాణ అవతరణ ప్రతినిధి గోదావరిఖని)రామగుండం ఏరియా. 1 పరిది లోని ప్రభావిత గ్రామాల ప్రజల ఆరోగ్య సంరక్షణలో భాగంగా ఆర్జి. 1 జి. యం డి.లలిత్ కుమార్ సూచన మేరకు ఈరోజు మల్కాపూర్ గ్రామములో ఉచిత వైద్య శిభిరం నిర్వహించటం జరిగినది. ఇట్టి మెడికల్ క్యాంపునకు మేడిపల్లి ఓసి ఓ జిడికె 1 గ్రూఫ్ ఏజంట్ లకిడి రమేష్ ముఖ్య అతిధిగా హజరై వైద్య శిభిరమును ప్రారంభించారుఈ సందర్బంగా ముఖ్య అతిథి లకిడి రమేష్ మాట్లాడుతూ సింగరేణిలో ప్రభావిత గ్రామమైన మల్కాపూర్ గ్రామస్తుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ఈ వైద్య శిభిరం నిర్వహించటం జరుగుతుందని ప్రజల ఆరోగ్య పరిరక్షణ విషయంలో సింగరేణి ఉద్యోగులతో పాటు ప్రభావిత గ్రామాల ప్రజల ఆరోగ్య విషయంలో కూడా ప్రత్యేక శ్రద్ద వహిస్తున్నదని తెలిపారు. ఇట్టి వైద్య శిభిరంలో వేసావి కాలం దృష్ట్యా ప్రత్యేకించి అనారోగ్య సమస్యలు, రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కారం పద్మ గారు అవగాహన కల్పించారు. అనంతరం సీజనల్ వ్యాధులకు సంబధించి జ్వరం, జలుబు, బిపి, షుగర్, తదితర వ్యాధులకు సంబధించి 65 మందికి పరిక్షలు నిర్వహించి, తగిన మందులను ఇవ్వటం జరిగినది. ఈ కార్యక్రములో వడ్లూరి రవి డివిజన్ కార్పోరేటర్ డాక్టర్ కారం పద్మ, డాక్టర్ మురళీకృష్ణ, డివై.పియం నాగుల వేణు, మేడిపల్లి ఓసిపి మేనేజర్ మల్లిఖార్జున్, పర్యవరణ అధికారి వేణు అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# నూతన దారి మైసమ్మ ఆలయంలో విగ్రహ పునః ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ దంపతులు

(తెలంగాణ అవతరణ ప్రతినిధి గోదావరిఖని)రామగుండం నియోజకవర్గం శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ గారు ఈరోజు అంతర్గం మండలం పరిధిలోని నూతన దారి మైసమ్మ ఆలయంలో నిర్వహించిన దారి మైసమ్మ తల్లి విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజ్ ఠాకూర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. భక్తి శ్రద్ధల మధ్య జరిగిన ఈ మహోత్సవంలో స్థానిక ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఆధ్యాత్మిక సంప్రదాయాలకు ప్రాధాన్యం ఇస్తూ, ప్రజల విశ్వాసాలకు అండగా నిలుస్తున్న ఎమ్మెల్యే పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రాంత ప్రజలందరికీ దారి మైసమ్మ తల్లి కటాక్షం ఎల్లప్పుడూ ఉండాలని, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు.



# ఆర్ జీవన్ ఏరియా పరిధిలోని ఎక్స్ప్లోరేషన్ డిపార్ట్మెంట్లో కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలపై కార్మికులను కలిసి చర్చించిన టీబిజీకెస్ ఉపాధ్యక్షులు వడ్డేపల్లి శంకర్





(తెలంగాణ అవతరణ ప్రతినిధి గోదావరిఖని)ఈ సందర్భంగా ఎక్స్ప్లోరేషన్ డిపార్ట్మెంట్ సందర్శించిన టీబీజీకేస్ నాయకులు కార్మికులకు అటెండెన్స్ లో ఎదుర్కొంటున్న సమస్యలపై అదేవిధంగా వేసవికాలంలో కార్మికులు వివిధ ప్రాంతాలకు ప్రయాణం చేయాల్సి ఉంటుందని వేసవి దృశ్య వారికి సంబంధించి మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయాలని పని స్థలాల్లో చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎూణ చర్చించారు దానికి వారు సానుకూలంగా స్పందించడం జరిగినదిఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ కోశాధికారి చెల్పూరిల సతీష్ ఆర్గనైజేషన్ సెక్రటరీ పొలాడి శ్రీనివాసరావు ఫిట్ సెక్రటరీ రెహమాన్ శ్రీనివాస్ కర్ణాకర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి కాలరీస్ హైస్కూల్ విద్యార్థుల ఘన విజయం: ఆర్.జి-1 జి.ఎం. డి. లలిత్ కుమార్ అభినందనలు



(తెలంగాణ అవతరణ ప్రతినిధి గోదావరిఖని) ఏప్రిల్-2026లో జరిగిన పదవ తరగతి (రాజ) ఫలితాలలో గోదావరిఖనిలోని సెక్టార్-×× సింగరేణి కాలరీస్ హైస్కూల్ (ఎయిడెడ్) విద్యార్థులు అద్భుతమైన ప్రతిభను కనబరిచారు. మొత్తం 97.87% ఉత్తీర్ణతతో పాఠశాల తన విజయ పరంపరను కొనసాగించింది. మొత్తం హాజరైన వారు: 47 మంది, ఉత్తీర్ణత సాధించిన వారు: 46 మంది, శతశాతం అన్ని సబ్జెక్టులలో విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించడం విశేషం. పాఠశాల టాపర్లు: పాఠశాల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల వివరాలు క్రింది విధంగా ఉన్నాయి:

1 ఆర్ల వశ్యాలిక - 545
2 గుంటుక సిరివల్లి - 538
3 పుట్టా శివ చరణ్ -527
4 ఓరుగంటి మేధాశ్రీ - 524
5 రేపాల శ్రీవల్లి - 506
6 బవండ్లపల్లి వినుత వర్ధిని -502
7 తలారి అభిషేక్ -- 502

విద్యార్థుల ఈ ఘన విజయంపై ఆర్.జి-1 జనరల్ మేనేజర్ డి. లలిత్ కుమార్ మరియు పాఠశాల కరస్పాండెంట్ రవీందర్ రెడ్డి, హర్షం వ్యక్తం చేశారు. కష్టపడి చదివి పాఠశాలకు మంచి పేరు తెచ్చిన విద్యార్థులను, వారికి వెన్నుదన్నుగా నిలిచిన తల్లిదండ్రులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అదేవిధంగా, నాణ్యమైన విద్యను అందిస్తూ 100% ఫలితాల కోసం కృషి చేసిన ప్రధానోపాధ్యాయుడు సంతోష్ మరియు ఉపాధ్యాయ బృందాన్ని (ఏ. శశికళ, హెప్సిబా, బి. కల్యాణి, తిరుమల, రేష్మ, ఎం.టి. స్వర్ణలత, జె. శ్రీలత, కె.వి. సుజాత, టి. శ్రీలత) ఆయన కొనియాడారు. భవిష్యత్తులో విద్యార్థులు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు.

# సులబ్ కార్మికుల కు ప్రతి నెల 7 తారీఖున జీతాలు ఇవ్వాలి ఏ వెంకన్న. - ఐ ఎఫ్ టీ యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి




(తెలంగాణ అవతరణ ప్రతినిధి గోదావరిఖని)సింగరేణిలో పనిచేస్తున్న సులబ్ కాంటాక్ట్ కార్మికులకు పెండింగ్ జీతాలను వెంటనే ఇవ్వాలని కోరుతూ ఆర్ జీ 1 డివిజన్ పరిధిలోని సీఎం ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించి పర్సనల్ మేనేజర్ నవీన్ వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ వెంకన్న మాట్లాడుతూ సింగరేణి లో ఆర్ జీ 1 డివిజన్ పరిధిలో సులబ్ కాంప్లెక్స్ లలో సుమారు 24 మంది కార్మికులు పనిచేస్తున్నారని వీరికి చట్టబద్ధ హక్కులు అమలు చేయాలని డిమాండ్ చేశారు సింగరేణి సులబ్ కార్మికులకు మార్చి నెల పెండింగ్ జీతాలను వెంటనే ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఈ ఎస్ఐ, పిఎఫ్ అమలు చేయాలని కాంట్రాక్టు కార్మికులకు 2018 సంవత్సరం నుండి బోనస్ చెల్లించాలని హెచ్ డి ఎఫ్ సీ బ్యాంకు ద్వారా ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని పెండింగ్లో ఉన్న ఏరియాస్ ను తక్షణమే చెల్లించాలని సంవత్సరానికి రెండు జతల బూట్లు రెండు జతల యూనిఫాం ఇవ్వాలని ప్రతినెల మాస్కులు, గ్లౌజులు ఇవ్వాలని నిత్యం వాడే కెమికల్స్ వల్ల సహజ మరణం పొందిన ఇన్సూరెన్స్ వర్తింప చేయాలని తదితర డిమాండ్ల సాధన కై సులభ కార్మికులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఐ ఎఫ్ టీ యు జిల్లా నాయకులు ఈ నరేష్ ఐ రాజేశం, కోట వెంకన్న ,రామారావు, నవీన్, మల్లేశ్వరి, దుర్గా, సుదర్శన్, లక్ష్మి , సమ్మయ్య, మల్లమ్మ, సామ్యూల్, సునీల్, తదితరులు పాల్గొన్నారు

# ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట -- రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



(తెలంగాణ అవతరణ ప్రతినిధి గోదావరిఖని) ఆర్టీసీ కార్మికుల చిరకాల కోరికలను నెరవేర్చుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలు నిర్వహించడం, అలాగే కార్మికులకు 11 శాతం పీఆర్సీ ప్రకటించడం వంటి కీలక నిర్ణయాలతో రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ గారు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం గోదావరిఖని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆర్టీసీ కార్మికులు ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ గారిని సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కట్టుబడి ఉందని, కార్మికుల శ్రేయస్సే ప్రజా రవాణా అభివృద్ధికి బలమైన పునాది అని అన్నారు. ప్రజా రవాణా వ్యవస్థను మరింత అభివృద్ధి చెందేలా కార్మికులు అంకితభావంతో పని చేయాలని సూచించారు. ఉద్యోగుల సంక్షేమం, ప్రజా సేవల అభివృద్ధి---ఈ రెండు లక్ష్యాల సాధనలో ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు.

# అవినీతిలో అగ్రస్థానం రెవెన్యూ, ఇరిగేషన్ లదే

హైదరాబాద్, , : తెలంగాణలో అవినీతి తిమింగలాల వేటలో ఏసీబీ అధికారులు ఈ ఏడాది దూకుడు పెంచారు. 2025లో ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 220 కంటే ఎక్కువ కేసులు నమోదు కాగా.. సుమారు 190మందికి పైగాప్రభుత్వఉద్యోగులను అధికారులు అరెస్ట్ చేశారు. ముఖ్యంగా ఇరిగేషన్, రెవెన్యూ శాఖల్లోనే లంచం కేసులు ఎక్కువగా వెలుగుచూశాయి. ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో దాదాపు రూ.58 కోట్లవిలువైన డాక్యుమెంట్లను సీజ్ చేయగా.. వీటి బహిరంగ మార్కెట్ విలువ రూ. 500 కోట్లకు పైనే ఉంటుందని అంచనా.లంచం అడిగే అధికారుల సమాచారాన్ని 1064 టోల్ ఫ్రీ నంబర్కు తెలియజేయాలనిఅధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. తెలంగాణలో అవినీతికి వ్యతిరేకంగా రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) తన పోరాటాన్ని ఉధృతం చేసింది. ప్రభుత్వ కార్యాలయాల్లో సామాన్యులను ఇబ్బంది పెడుతూ లంచాలకు అలవాటు పడిన అధికా రుల భరతం పట్టడంలో అధికారులు ఈ ఏడాది సరికొత్త రికార్డులను సృష్టించారు. 2025 సంవత్సరం ప్రారంభం నుండి ఇప్పటివరకు తెలంగాణ వ్యాప్తంగా ఏసీబీ అధికారులు 220 కంటే ఎక్కువ కేసులు నమోదు చేశారు. ఇది గత ఏడాదితో పోలిస్తే భారీ పెరుగుదల. ఈ కేసులలో భాగంగా దాదాపు 150 మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులను అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు. పట్టుబడిన కేసులలో అధిక శాతం లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్గా దొరికిపోయినవే. 2024లో మొత్తం 152 కేసులు నమోదు కాగా.. ఈ ఏడాది ఆ సంఖ్య ఇప్పటికే 220 దాటిపోయింది. అంటే దాదాపు 100 కేసులు అదనంగా నమోదయ్యాయి. ఈ ఏడాది దాడులలో కొన్ని శాఖలకు చెందిన అధికారులు అక్రమ సంపాదనలో రికార్డులు సృష్టించారు. నీటి పారుదల శాఖ, రెవెన్యూ విభాగాల్లో అత్యధికంగా లంచం కేసులు వెలుగుచూశాయి. భూముల వ్యవహారాలు, ప్రాజెక్టుల బిల్లుల క్లియరెన్స్ కోసం సామాన్యులను వేధించిన అధికారులు ఏసీబీ వలలో చిక్కారు. ఇటీవల రవాణా శాఖలో జరిగిన సోదాలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. ఒకే అధికారి వద్ద వందల కోట్ల అక్రమాస్తులు బయటపడటం అధికారులనే విస్మయానికి గురిచేసింది.



# మృణాల్‌తో సినిమా అంటే హీరోలు జాగ్రత్తగా ఉండాల్సిందే!



టాలీవుడ్ సెన్సేషనల్ హీరోయిన్ మృణాల్ ఠాకూర్‌తో సినిమాలు చేసే హీరోలు జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే, సెంటిమెంట్ అలా నడుస్తుంది.ప్రస్తుతం మృణాల్ ఠాకూర్ పేరు ఇండస్ట్రీ వర్గాల్లో ఎలా వినిపిస్తుందో తెలిసిందే. రీసెంట్‌గా ధనుష్ తో పెళ్లి అంటూ ఆమెపై వార్తలు వచ్చాయి. ఆ వార్తలకి ఎలాగోలా స్టాప్ పెట్టిన మృణాల్.. ఇప్పుడు తన సినిమాలతో చర్చల్లో నిలుస్తున్నారు. అడివి శేష్ సరసన హీరోయిన్‌గా నటించిన 'డెకాయిట్' చిత్రం థియేటర్లలో విడుదలై.. సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది.

ఈ సినిమా ప్రమోషన్స్‌లో మృణాల్ యమా యాక్టివ్‌గా పాల్గొంటున్నారు. అలా ఓ ఈవెంట్‌లో తెలుగు హీరోనే పెళ్లి చేసుకుంటుందని, మృణాల్‌పై అల్లు అరవింద్ చేసిన కామెంట్స్ బాగా వైరల్ అయిన విషయం తెలిసిందే. దీంతో తెలుగు ప్రేక్షకులు ఆమెపై ఇంకాస్త ఇంట్రెస్ట్ పెడుతున్నారు. ప్రస్తుతం 'పెద్ది' సినిమాలో స్పెషల్ సాంగ్‌కు ఈ అందాల భామ సెలక్ట్ అయినట్లుగా వార్తలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే, తాజాగా తన సినిమాల్లోని ఒక వింత సెంటిమెంట్ గురించి ఈ భామ బయటపెట్టి అందరినీ ఆశ్చర్యపరిచింది. తాజాగా జరిగిన ఒక ఇంటర్వ్యూలో మృణాల్ మాట్లాడుతూ.. తన స్నేహితులు తనను సరదాగా 'హస్బెండ్ మర్డరర్' (భర్తలను చంపేసే భార్య) అని ఆటపట్టిస్తుంటారని నవ్వుతూ చెప్పింది. అందుకు కారణం ఆమె నటించిన వరుస సినిమాలు, అందులో హీరోల పాత్రల ముగింపేనని అంటోంది. ఆ వివరాల్లోకి వెళితే.. హిందీ 'జెర్సీ' సినిమాలో షాహిద్ కపూర్ పాత్ర చివరికి చనిపోతుంది. 'సీతారామం' వంటి బ్లాక్ బస్టర్ హిట్ మూవీలో కూడా దుల్కర్ సల్మాన్ పాత్ర ప్రాణాలు విడుస్తుంది. అలాగే 'ధమాకా'లో కార్తీక్ ఆర్యన్ పాత్ర కూడా అంతే! ఇక తాజాగా విడుదలైన 'డెకాయిట్' సినిమాలో కూడా హీరో అడవి శేష్ పాత్రకు ఇదే గతి పట్టింది. "సీతారామంలో రామ్ చనిపోయారు.. ఇప్పుడు అడవి శేష్ పాత్ర కూడా అంతే! నా సినిమాల్లో హీరోలందరినీ ఇలా చంపేస్తున్నందుకు నా ఫ్రెండ్స్ నన్ను ఆటపట్టిస్తున్నారు" అంటూ మృణాల్ సరదాగా చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఈ వీడియోకు నెటిజన్లు కూడా సరదాగా రియాక్ట్ అవుతున్నారు. మృణాల్‌తో కలిసి నటించే హీరోలు తమ పాత్రల విషయంలో కాస్త జాగ్రత్తలు తీసుకోవాలంటూ నెటిజన్లు చేసే కామెంట్స్‌తో ఈ వీడియో బాగా చక్కర్లు కొడుతోంది.

# సినిమా



## నాన్న క్రమశిక్షణే నాకు స్ఫూర్తి..

# తండ్రిపై చరణ్ ఆసక్తికర కామెంట్స్



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం దర్శకుడు బుచ్చిబాబు సనా తెరకెక్కిస్తున్న 'పెద్ది' చిత్రంతో బిజీగా ఉన్నారు. బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్న ఈ సినిమా షూటింగ్ దాదాపు పూర్తయింది. మొదట ఏప్రిల్‌లో విడుదల చేయాలనుకున్న ఈ మూవీని, ప్రేక్షకులకు మరింత మెరుగైన థియేట్రికల్ అనుభూతిని అందించేందుకు జూన్‌కు వాయిదా వేసారు.ఇక ఇదిలా ఉంటే, రామ్ చరణ్ మరో అంతర్జాతీయ గుర్తింపును అందుకున్నారు. ప్రతిష్టాత్మక 'ఈ స్క్వైర్ ఇండియా' మ్యాగజైన్ కవర్‌పై చోటు దక్కించుకున్న టాలీవుడ్ హీరోగా ఆయన ప్రత్యేక రికార్డ్ సృష్టించారు. ఈ సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత, వృత్తిగత జీవితంపై పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. తన తండ్రి, మెగాస్టార్ చిరంజీవి ప్రభావం గురించి మాట్లాడుతూ, "నా జీవితంలో నిజమైన హీరో నాన్నే" అని గర్వంగా తెలిపారు. నాన్న వారసత్వాన్ని అందిపుచ్చుకోవడం తమకు సులభంగా అనిపించినప్పటికీ, ఆయన పడ్డ కష్టం మాత్రం అపారమని అన్నారు. సినిమాల కోసం చిరంజీవి పడే కష్టం గురించి చెబుతూ, షూటింగ్‌ల సమయంలో రోజుకు కేవలం నాలుగు గంటలు మాత్రమే నిద్రపోయిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని గుర్తు చేసుకున్నారు. అంత బిజీ షెడ్యూల్‌లో కూడా కుటుంబానికి సమయం కేటాయించడంలో ఆయన ఎప్పుడూ రాజీ పడలేదని వెల్లడించారు. ఎంతటి స్టార్‌డమ్ ఉన్నా ఇంట్లో మాత్రం సాధారణ తండ్రిలా ఉండటం చిరంజీవి ప్రత్యేకత అని కొనియాడారు. కష్టాల్లో ఉన్న సినీ పరిశ్రమ వ్యక్తులకు అండగా నిలవడంలో ఆయన ఎప్పుడూ ముందుంటారని చెప్పారు.

వృత్తిపరమైన బాధ్యతలు, కుటుంబ బంధాలను సమన్వయం చేసుకోవడం ఎలా అనేది తన తండ్రిని చూసే నేర్చుకున్నానని చరణ్ తెలిపారు.ఎన్ని అడ్డంకులు ఎదురైనా ధైర్యంగా ముందుకు సాగే చిరంజీవి తత్త్వం తనపై ఎంతో ప్రభావం చూపిందని, ప్రస్తుతం తాను కూడా అదే మార్గాన్ని అనుసరిస్తున్నానని పేర్కొన్నారు. మూడు రోజులు విరామం దొరికినా కుటుంబంతో గడపడానికి ప్రాధాన్యత ఇచ్చే ఆయన క్రమశిక్షణ తనకు స్ఫూర్తిగా నిలిచిందని చెప్పారు. రామ్ చరణ్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అభిమానులను ఆకట్టుకుంటున్నాయి.

# బన్నీ 'రాకా'లో బాలీవుడ్ బాద్‌షా?




'పుష్ప'తో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, తమిళ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో వస్తున్న 'రాకా' సినిమాపై అంచనాలు తారాస్థాయికి చేరుతున్నాయి. ఇటీవలే విడుదలైన ఫస్ట్‌లుక్‌తో సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేసిన చిత్రబృందం ఇప్పుడు ఓ ఆసక్తికరమైన వార్తతో చర్చల్లో నిలిచింది. ఈ చిత్రంలో బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్ ఓ కీలక అతిథి పాత్రలో కనిపించనున్నారనే ప్రచారం సినీ వర్గాల్లో జోరుగా సాగుతోంది. గతంలో షారుక్ ఖాన్‌తో అట్లీ తీసిన 'జవాన్' చిత్రం భారీ విజయం సాధించింది. వీరిద్దరి మధ్య ఉన్న మంచి అనుబంధం కారణంగానే 'రాకా'లో అతిథి పాత్రకు షారుక్ అంగీకరించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ప్రచారానికి ఇది మరింత బలం చేకూరుస్తోంది. అయితే, దీనిపై చిత్రబృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.సన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ సినిమా ఫస్ట్‌లుక్‌లో అల్లు అర్జున్ సరికొత్త అవతారంలో కనిపించి అభిమానులను ఆశ్చర్యపరిచారు. ఈ లుక్ కోసం ఆయన రోజూ 3 నుంచి 4 గంటల సమయం కేటాయిస్తున్నట్లు సమాచారం. ఇక హీరోయిన్ విషయంలోనూ పలువురి పేర్లు ప్రచారంలో ఉన్నాయి. ప్రధానంగా దీపికా పదుకొణె పేరు బలంగా వినిపిస్తుండగా, రష్మిక మందన్న, జాన్వీ కపూర్, మృణాల్ ఠాకూర్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది.ప్రస్తుతం ముంబైలో శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమా నటీనటుల పూర్తి వివరాలపై స్పష్టత రావడానికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది. భారీ అంచనాల నడుమ తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు.

## ప్రకాష్ రాజ్ వ్యాఖ్యల వివాదం...


# రామాయణంపై చేసిన వ్యాఖ్యలతో దేశవ్యాప్తంగా ఆగ్రహం



ప్రముఖ నటుడు ప్రకాష్ రాజ్ ఇటీవల రామాయణం, దేశంలోని సామాజిక పరిస్థితులపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారి తీశాయి. ఒక ప్రైవేట్ ఈవెంట్‌లో మాట్లాడుతూ ఆయన చేసిన వ్యాఖ్యలు హిందూ సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకతను రేకెత్తించాయి.రాముడు, లక్ష్మణుడు ఉత్తర భారతం నుంచి వచ్చినవారని, దక్షిణాదిలో ఓ గిరిజనుడైన రావణుడి పొలంలోకి వెళ్లి పండ్లు తిన్నారని, ఆ విషయంపై వివాదం చెలరేగిందని ఆయన వ్యాఖ్యానించినట్లు సమాచారం. ఈ వ్యాఖ్యలు రామాయణ గాథను వక్రీకరించేలా ఉన్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.అదే విధంగా, ఒక మీడియా సమావేశంలో కూడా శ్రీరాముడు ఉత్తర భారతానికి చెందినవారని, రావణుడు దక్షిణ భారత తెగకు చెందినవాడని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు కోట్లాది మంది హిందువుల మనోభావాలను దెబ్బతీశాయని సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ఆగ్రహం వ్యక్తమవుతోంది. పురాణ గాథలను తప్పుగా చూపిస్తూ, ప్రాంతీయ విభేదాలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారని పలువురు విమర్శిస్తున్నారు. మతపరమైన అంశాలపై బాధ్యతాయుతంగా మాట్లాడాల్సిన అవసరం ఉందని నెటిజన్లు సూచిస్తున్నారు. ఇక దేశంలోని ప్రస్తుత పరిస్థితులపై కూడా ప్రకాష్ రాజ్ చేసిన వ్యాఖ్యలు వివాదాన్ని మరింత పెంచాయి. మైనారిటీలు, గిరిజనులు, ముస్లింలపై ప్రమాదం ఉందని ఆయన చేసిన ఆరోపణలు ఆధారరహితమని కొందరు విమర్శిస్తున్నారు. ఈ వ్యాఖ్యలపై ఇప్పటికే పలుచోట్ల పోలీసులకు ఫిర్యాదులు అందాయి. మతపరమైన మనోభావాలను కించపరిచినందుకు, సమాజంలో విద్వేషాలను ప్రేరేపించినందుకు గాను ఆయనపై క్రిమినల్ కేసులు నమోదైనట్లు సమాచారం. సోషల్ మీడియా వేదికలపై ఆయనను అరెస్ట్ చేయాలనే డిమాండ్లు కూడా వినిపిస్తున్నాయి. ప్రకాష్ రాజ్ చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చకు దారి తీస్తూ, రాజకీయ, సామాజిక వర్గాల్లో పెద్ద ఎత్తున స్పందన రాబడుతున్నాయి.

## కన్నవారికి కర్మలు చేయలేకపోయా...

# పాపం ప్రతాప్ హీరో ఎమోషనల్ కామెంట్స్ వైరల్



టాలీవుడ్ యంగ్ హీరో తిరువీర్ తాజాగా 'పాపం ప్రతాప్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఫ్యామిలీ అండ్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. తన సహజమైన నటనతో తిరువీర్ మరోసారి ప్రత్యేక గుర్తింపు సంపాదిస్తున్నాడు.అయితే ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తిరువీర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి. తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఒక బాధాకర విషయాన్ని ఆయన అభిమానులతో పంచుకున్నారు. సినిమా షూటింగ్ షెడ్యూల్స్, లుక్ కంటిన్యూటీ సమస్యల కారణంగా తన తల్లిదండ్రుల అంత్యక్రియలు, అనంతర కర్మకాండలను సరిగ్గా నిర్వహించలేకపోయానని తిరువీర్ భావోద్వేగంతో చెప్పారు.షూటింగ్ మధ్యలో జుట్టు కత్తిరించడం లేదా లుక్ మార్చడం సాధ్యం కాకపోవడంతో, వృత్తిపరమైన బాధ్యతల కోసం వ్యక్తిగతంగా పెద్ద త్యాగం చేయాల్సి వచ్చిందని వివరించారు. ఈ కారణంగా కుటుంబ సభ్యులు, బంధువుల నుంచి విమర్శలు కూడా ఎదుర్కొన్నానని ఆయన వెల్లడించారు. ఒక్కడే కొడుకువై ఉండి కనీసం ఈ మాత్రం కూడా చేయలేవా? అని అడిగిన సందర్భాలు తనను మరింత బాధించాయని తెలిపారు. వృత్తి పట్ల ఉన్న అంకితభావం తనను వ్యక్తిగతంగా ఎంతగా కలిచివేసిందో చెబుతూ, ఆ గిల్ట్ జీవితాంతం తనను వెంటాడుతుందని తిరువీర్ పేర్కొన్నారు. బయటకు నటుడిగా నవ్వుతూ కనిపించినా, లోపల ఎన్నోబాధలు, త్యాగాలు ఉంటాయని ఆయన మాటలు స్పష్టం చేశాయి. 'పాపం ప్రతాప్' సినిమా విజయవంతం కావాలని ఆశిస్తూ, తన కష్టానికి తగిన గుర్తింపు రావాలని అభిమానులు కోరు కుంటు న్నారు.

# 16 ఏళ్ల న్యాయపోరాటం.. నటి తమన్నాకు మద్రాస్ హైకోర్టులో భారీ షాక్!



మద్రాస్ హైకోర్టులో ప్రముఖ నటి తమన్నా భాటియాకు భారీ షాక్ తగిలింది. సుమారు 16 ఏళ్లుగా సాగుతున్న సుదీర్ఘ న్యాయ పోరాటంలో చివరకు ఆమెకు చుక్కెదురైంది. గతంలో 'పవర్ సోప్స్' అనే సంస్థకు బ్రాండ్ అంబాసిడర్‌గా పనిచేసిన తమన్నా, తన ఒప్పంద కాలం ముగిసిన తర్వాత కూడా ఆ సంస్థ తన ఫోటోలను ప్రకటనల్లో వాడుకుందని ఆరోపిస్తూ 2011లో కోర్టును ఆశ్రయించారు. తన అనుమతి లేకుండా ఫోటోలు వాడినందుకు గాను కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించాలని ఆమె సివిల్ సూట్ దాఖలు చేశారు.

అయితే ఈ కేసును విచారించిన మద్రాస్ హైకోర్టు డివిజన్ బెంచ్, తమన్నా ఆరోపణలకు తగిన సాక్ష్యాధారాలు లేవని స్పష్టం చేసింది. ఆమె సమర్పించిన సబ్బు కవర్లు, ఇతర పత్రాలు సదరు సంస్థ ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘనకు పాల్పడిందని నిరూపించలేకపోయాయని కోర్టు అభిప్రాయపడింది. గతంలోనే ఒక సింగిల్ జడ్జి ఆమె పిటిషన్‌ను కొట్టివేయగా, దానిని సవాలు చేస్తూ తమన్నా అప్పీల్‌కు వెళ్లారు. తాజాగా జస్టిస్ పి. వేల్మురుగన్, జస్టిస్ కె. గోవిందరాజన్ తిలకవతిలతో కూడిన ధర్మాసనం పాత తీర్పునే సమర్థిస్తూ ఆమె అప్పీల్‌ను పూర్తిగా కొట్టివేసింది.

Printer, Published and Owned by AMBATI PUBLICATIONS at H.No. 8-3-214, Mallikarjun Nagar, Godavarikhani, Dist. Peddapalli. Telangana State - 505 209.“
Printers : Ganesh Offset Printers, Godavarikhani. Editor: P. Ramakrishna, RNI No. TELTEL/2021/02031, email : yadavpolaveni123456@gmail.com, Mobile : 7396644411